క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 8న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కాజీపేటలోని దర్గా, హౌజింగ్ బోర్డు కాలనీ, బియాబానీ నగర్, గాంధీనగర్, బీజేపీ క్వార్టర్స్ ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, జులైవాడ, సుబేదారి ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మురావత్ మంజికి డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని పొలిటికల్ సైన్స్ విభాగం పరిశోధకుడు మురావత్ మంజికి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. 'ట్రైబల్ డెవలప్‌మెంట్ ఇన్ తెలంగాణ స్టేట్ ఏ స్టడీ ఆన్ ఇంప్లిమెంటేషన్ ఆఫ్ పాలసీస్ అండ్ ప్రోగ్రామ్స్ ఇన్ ఆసిఫాబాద్ డివిజన్' అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి మురావత్ మంజికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ నర్సింహచారి తెలిపారు. ఆ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ వీరన్న పర్యవేక్షణలో మంజి తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

శరన్నవరాత్రోత్సవాలు



లలితాదేవిగా రాజరాజేశ్వరి



హనుమకొండ లక్ష్మీపురంలో..

హన్మకొండ కల్చరల్: వరంగల్ ఎంజీఎం ఎదురుగా ఉన్న రాజరాజేశ్వరి దేవి దేవాలయంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా లలితా పంచమిని పురస్కరించుకుని ఆలయ అర్చకుడు యల్లంభట్ల లక్ష్మణశర్మ ఆధ్వర్యంలో రాజరాజేశ్వరి అమ్మవారికి వహ్నివాసిని క్రమంలో చతుషష్టి ఉపచార పూజలు సోమవారం నిర్వహించారు. అనంతరం లలితాఅమ్మవారుగా భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమాలను ఆలయ చైర్మన్ వద్దిరాజు వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

పర్యావరణంపై అవగాహన



కాజీపేట: పర్యావరణ పరిరక్షణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో కాజీపేట 61వ డివిజన్ సిద్ధార్థనగర్ వడ్డేపల్లి ట్యాంక్‌బండ్‌పై జాతీయ వన్యప్రాణి వారోత్సవాలను రిటైర్డ్ డీఎఫ్ఓ పురుషోత్తం సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువులు, కుంటలను పరిరక్షించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శ్యాంసుందర్, నాగేశ్వర్ రావు, డాక్టర్ రాములు పాల్గొన్నారు.

అనాథాశ్రమాలకు తరలించాలి



ఎంజీఎం: బస్‌షెల్టర్లు, రైల్వే స్టేషన్లు, కూడళ్లలో యాచిస్తూ జీవనం కొనసాగిస్తున్న అనాథలు, వృద్ధులను అనాథాశ్రమాలకు తరలించాలని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గోపాలపురం బాధ్యులు కోరారు. ఎంజీఎం ఆస్పత్రి ఎదురుగా ఉన్న బస్‌షెల్టర్‌ను వారు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా బస్‌షెల్టర్‌లో ఉంటున్న అభాగ్యుల ఇబ్బందులు, ప్రయాణికుల అవస్థలను తెలుసుకున్నారు. సంఘం కార్యదర్శి తేరాలి యుగంధర్, సభ్యులు మలాల్‌రావు, మార్క రవీందర్‌గౌడ్, శంకరయ్య పాల్గొన్నారు.

వీల్ చైర్లు, స్ట్రెచర్లకు మరమ్మతులు



దేశాయిపేట: వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో పనిచేయని వీల్ చైర్లు, స్ట్రెచర్లకు 13వ డివిజన్ కార్పొరేటర్ సురేష్‌కుమార్‌జోషి మరమ్మతులు చేయించారు. డివిజన్‌లోని నవయుగకాలనీకి చెందిన ఒక మహిళ ప్రమాదవశాత్తు డ్రెయినేజీలో పడిపోగా చికిత్స నిమిత్తం ఆమెను ఎంజీఎం ఆస్పత్రిలో ఆదివారం చేర్పించారు. ఈక్రమంలో అక్కడి పనిచేయని వీల్ చైర్లు, స్ట్రెచర్లతో సిబ్బంది పడుతున్న ఇబ్బందులను కార్పొరేటర్ గమనించారు. 7 వీల్ చైర్లు, 7 స్ట్రెచర్లను వరంగల్ ఆటోనగర్‌లోని మెకానిక్ వద్ద వీల్స్, వెల్డింగ్ చేయించారు. వాటి ఖర్చులను వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ సివిల్ కాంట్రాక్టర్ పుల్లరి వెంకటేశ్వర్లు ఆర్థికంగా సాయం అందించారని సురేష్‌జోషి తెలిపారు.

సెంచరీ దాటిన గంజాయి కేసులు

- వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో 101 కేసుల నమోదు
- పోలీసులు విస్తృత తనిఖీలు చేస్తున్నా ఆగని దందా
- రూ.మూడు కోట్ల విలువైన గంజాయి స్వాధీనం
- పండుగ వేళ ప్రత్యేక నిఘా

సాక్షి, వరంగల్: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నమోదైన గంజాయి కేసుల సంఖ్య సెంచరీ దాటింది. పోలీసులు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నప్పటికీ నిత్యం ఎక్కడో ఒకచోట గంజాయి పట్టుబడడం కలకలం రేపుతోంది. ఈఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 101 గంజాయి కేసులు నమోదయ్యాయంటే ఈదందా తీవ్రత ఎంత ఉందో ఇట్టే తెలిసిపోతోంది.

యువకులే టార్గెట్

గంజాయి రవాణా, వినియోగంలో యువతను టార్గెట్ చేస్తూ అక్రమార్కులు వ్యాపారం సాగిస్తున్నారు. పల్లెలకు సైతం తాకిన ఈ వ్యసనానికి చెక్ పెట్టేందుకు పోలీసులు తనిఖీలు చేపడుతున్నారు. కాలేజీల్లో, విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. అయినా చాపకింద నీరులా గంజాయి రవాణా, వినియోగం విస్తరిస్తోంది.

ప్రత్యేక దృష్టి..

మంచి భవిష్యత్ ఉన్న యువత జీవితాలు ఆగమాగం అవుతుండడంతో వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఈ గంజాయి దందాపై ప్రత్యేక దృష్టి సారించారు. కొన్ని సందర్భాల్లో తమకు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు చేసి పట్టుకుంటున్నారు. ఇంకొన్నిసార్లు ఆయా స్థానిక పోలీస్ స్టేషన్ సిబ్బంది సహకారంతో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న నేరగాళ్లను అరెస్ట్ చేస్తున్నారు. ఇలా ఇప్పటి వరకు ఈ ఏడాది జనవరి నుంచి నమోదైన 101 కేసుల్లో 850 కిలోల గంజాయిని పట్టుకున్నారు. దీని విలువ మార్కెట్లో సుమారు రూ.మూడు కోట్లు ఉంటుంది.

మచ్చుకు కొన్ని ఘటనలు

- ఇటీవల వరంగల్ చింతల్ బ్రిడ్జి వద్ద రూ.2.10 లక్షల విలువైన ఎనిమిది కిలోల 400 గ్రాముల గంజాయిని మహారాష్ట్రలోని ముంబైకి చెందిన వ్యక్తి నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.
- నర్సంపేట మండలంలోని రాజుపేట, కమలాపురం గ్రామాల శివార్లలో 365 జాతీయ రహదారిపై కారులో తరలిస్తుండగా ఆగస్టు 3న 256 కిలోల గంజాయిని నర్సంపేట పోలీసులు, టాస్క్ ఫోర్స్ సంయుక్త ఆధ్వర్యంలో పట్టుకున్నారు. దీని విలువ రూ. 64 లక్షలు ఉంటుంది.
- జూలై 24న శివనగర్ రైల్వే స్టేషన్ థర్డ్ ప్లాట్‌ఫారం వైపున ఉండే ఆటో స్టాండ్ వద్ద ఒడిషాకు చెందిన వ్యక్తి నుంచి 26 కిలోల గంజాయి లభించింది. పోలీసులు అతడిని అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.



అనంతసాగర్ క్రాస్ వద్ద ట్రాక్టర్ డబ్బా కింద దొరికిన గంజాయి ప్యాకెట్లు (ఫైల్)

ప్రత్యేక చర్యలు..

గంజాయి రవాణా, సేవించడంపై ఎప్పటి నుంచో ప్రత్యేక దృష్టి సారించాం. ఎందుకంటే చాలా మంది యువత దీనికి అలవాటు అవుతున్నారు. అదే సమయంలో ఈజీ మనీ కోసం గంజాయి అక్రమ రవాణా చేస్తున్నట్లుగా మా నిఘాలో తేలింది. పెద్ద బతుకమ్మ, దసరా వేళ వీటి విక్రయాలపై ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందంతో గంజాయి రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

– అంబర్ కిశోర్ ఝా, సీపీ

14న రౌండ్‌టేబుల్ సమావేశం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కమిటీ బాధ్యులు

విద్యారణ్యపురి: రాష్ట్రంలో విద్యారంగంలో వస్తున్న మార్పులపై ఈనెల 14న హనుమకొండలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించాలని సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన విద్యా పరిరక్షణ కమిటీ హనుమకొండ, వరంగల్ జిల్లాల సన్నాహక సమావేశంలో సోమవారం నిర్ణయించారు. సమావేశంలో విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర బాధ్యులు నన్నబోయిన తిరుపతి, కడారి భోగేశ్వర్, అటుకుల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. ప్రజాపరిపాలన తెస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వంలో కూడా విద్యారంగంలో విధ్వంసం కొనసాగుతోందని ఆరోపించారు. 30వేల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సరైన సౌకర్యాలు కల్పించకుండా విద్యారంగంలో అంతరాల దొంతరలుగా మరొరకమైన పాఠశాలలను తీసుకురావటం సరైనది కాదని అభిప్రాయపడ్డారు. అశాస్త్రీయంగా ఉన్న జీఓ 25 ద్వారా పాఠశాల విద్యకు పునాదిగా ఉన్న ప్రాథమిక పాఠశాలలను మూసివేసే కుట్ర జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యారంగానికి బడ్జెట్‌లో కేటాయించిన 7.3శాతం నిధులతో పాఠశాలల అభివృద్ధి జరగదన్నారు. సమావేశంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ బాధ్యులు కే.శ్రీనివాస్, ముత్యాల రఘుపతి, గొడిశాల సత్యనారాయణ, గోవిందరావు, వెంకటేశ్వర్లు, మనోజ్, నర్సింహస్వామి, ఉట్కూరు అశోక్, తదితరులు పాల్గొన్నారు. తొలుత రౌండ్‌టేబుల్ సమావేశానికి సంబంధించి కరపత్రాలను విడుదల చేశారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్య తీసుకోవాలి

మామునూరు: రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని అధికారులకు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు సూచించారు. ఈమేరకు వరంగల్ జాతీయ రహదారిపై ఆర్టీఏ జంక్షన్ నుంచి ఐనవోలు క్రాస్‌రోడ్డు వరకు, ఐనవోలు నుంచి వర్ధన్నపేట వరకు బల్దియా కమిషనర్ అశ్విని తానాజీవాకడే, ఆర్అండ్‌బీ అధికారులు, జీడబ్ల్యూఎంసీ అధికారులతో కలిసి ఆయన సోమవారం సాయంత్రం పర్యటించారు. వర్ధన్నపేట నుంచి వరంగల్ ఆర్టీఏ జంక్షన్ వరకు జరుగుతున్న రోడ్డు ప్రమాదాల స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మామునూరు వద్ద తరుచుగా ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని అన్నారు. వర్షాకాలం రోడ్డుపై నీరు నిలిచి ఉండడం వల్ల ప్రమాదాల జరుగుతున్నాయని తెలిపారు. అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బల్దియా అధికారులు ఎస్ఈ రాజయ్య, సీపీ రవీంద్ర, ఈఈలు శ్రీనివాస్, మహేందర్, ఏసీపీ తిరుపతి, ఎన్‌హెచ్ బల్దియా అధికారులు పాల్గొన్నారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

హసన్‌పర్తి: రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. ఎమ్మెల్యేను ఆత్మకూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా నియమితులైన తంగళ్లపల్లి తిరుపతి, డైరెక్టర్లు పల్లె దయాకర్, జాడి గాంధీ, గౌరు రాజిరెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేసిన ప్రభుత్వం రేవంత్‌రెడ్డి సర్కార్ అని కొనియాడారు. కొన్ని సాంకేతిక కారణాల వల్ల కొంతమంది రైతులకు రుణమాఫీ జరగలేదన్నారు. రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్‌రెడ్డి, నాయకులు సంతోష్, రామంచ దయాకర్, మాజీ ఉప సర్పంచ్ చంటిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



బొకే అందజేస్తున్న మార్కెట్ కమిటీ సభ్యులు

మార్కెట్ కార్మికులకు పని కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న కార్మిక నాయకులు

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్‌ను నమ్ముకుని సుమారు 5వేల మంది వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులకు సరైన పని కల్పించాలని వరంగల్ వ్యవసాయ మార్కెట్ కార్మిక సంఘాల నాయకులు కోరారు. ఈమేరకు వరంగల్ మార్కెట్ ఉన్నత కార్యదర్శి పి.నిర్మలను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమయపాలన లేకుండా కష్టించి పనిచేస్తూ తమ కుటుంబాలను కార్మికులు పోషించుకుంటున్నారని పేర్కొన్నారు. ఇటీవల పంట ఉత్పత్తులు నేరుగా మిల్లులు, గోదాముల వద్ద క్రయవిక్రయాలు జరుపుతుండడంతో వారు ఆర్థికంగా నష్టపోతున్నారని తెలిపారు. మార్కెట్ బైలా ప్రకారం మార్కెట్ బయట వ్యాపారాలు జరగకుండా మార్కెట్లోనే దిగుమతి, క్రయ, విక్రయాలు, కాంటాలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కార్యదర్శిని కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు ఇనుముల మల్లేషం, సుంచు కనకయ్య, గంధం సుధాకర్, యాకయ్య, యాకుబ్, జగదీశ్వర్, వెంకటయ్య, అయిలయ్య, గజేందర్‌రాజు, శ్రీను, సుధాకర్, సంతోష్, శేఖర్, వేణుగోపాల్, దడవాయి యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఈటల దేవేందర్, సోల రవి, స్వామి, బోస్ పాల్గొన్నారు.

జీపీ కార్మికులకు వేతనాలు చెల్లించాలి



ధర్నా చేస్తున్న జీపీ ఉద్యోగులు

వరంగల్: రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు, పెండింగ్‌లో ఉన్న వేతనాలను ప్రభుత్వం చెల్లించాలని గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చాగంటి వెంకటయ్య, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వరంగల్ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 12,769 గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వ లెక్కల ప్రకారంగా 52 వేల మంది కార్మికులు, ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధిలైట్లు, డంపింగ్ యార్డ్, హరితహారం, పల్లె ప్రకృతి వనాలు వైకుంఠధామాల్లో పనులు చేస్తూ ప్రజలకు సేవలందిస్తున్న కార్మికులకు పనిభద్రత కల్పించకపోగా శ్రమకు తగ్గ ఫలితంగా వేతనం ఇవ్వడం లేదని ఆరోపించారు.

నగరంలో చేపల మార్కెట్లు నిర్మించాలి



ధర్నా చేస్తున్న చేపల విక్రయదారులు

వరంగల్ అర్బన్: నగరంలోని అనేక ప్రాంతాల్లో రహదారులపై చేపలు విక్రయిస్తున్న చిరు వ్యాపారులకు ఆయా ప్రాంతాల్లో మార్కెట్లు నిర్మించాలని తెలంగాణ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం (టీఎంకేఎంకేఎస్) నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు బల్దియా ప్రధాన కార్యాలయం ఎదుట చిరువ్యాపారులతో కలిసి నాయకులు సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏళ్ల తరబడి ఫుట్‌పాత్‌లనే జీవనాధారం చేసుకొని చేపలు విక్రయిస్తున్నారని తెలిపారు. నగరంలో ప్రత్యేకంగా 10 ఎకరాల స్థలం కేటాయించి రూ.50 కోట్ల వ్యయంతో అంతర్జాతీయ ప్రమాణాలతో హోల్‌సేల్, రిటైల్, ఎక్స్‌పోర్ట్ మార్కెట్లను నిర్మించాలని కోరారు. హనుమకొండ ఓల్డ్ బస్ డిపో, కాజీపేట బాపూజీనగర్, ఫాతిమా రోడ్డు, వడ్డేపల్లి తిరుమల జంక్షన్, కుమార్‌పల్లి, పెగడపల్లి డబ్బాలు, హసన్‌పర్తి చెరువు కట్ట, తదితర ప్రాంతాల్లో చిరు వ్యాపారులు చేపలు అమ్ముకుంటున్నారని వివరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు నిమ్మల విజేందర్ ముదిరాజ్, ఉపాధ్యక్షులు దుర్గయ్య, పిట్టల రవి, ప్రధాన కార్యదర్శి గొడుగు వెంకట్, నాయకులు శ్రీలత, సమ్మక్క, రమేష్‌బాబు, పోలు పద్మ, రజిత, శ్రీకాంత్, పోలు వనమ్మ, సాగర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై టాస్క్‌ఫోర్స్ దాడులు



నగదు చూపిస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

ఖిలా వరంగల్: ఓ ఇంట్లో పేకాట స్థావరంపై దాడి చేసి రూ.13,040ల నగదు, ప్లేకార్డులు, నాలుగు స్మార్ట్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని నలుగురు నిందితులపై కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూధన్ తెలిపారు. మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధి క్రిస్టియన్ కాలనీలో ఓ ఇంట్లో పేకాట స్థావరంపై ఇన్‌స్పెక్టర్ సార్ల రాజు నేతృత్వంలో సోమవారం రాత్రి దాడి చేశారు. నిందితులు గంద్రకోట శ్రీను, బోనాల సామిల్, సోముల ప్రదీప్, వస్కుల వినయ్‌ను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.13,040 నగదును స్వాధీనం చేసుకుని తదుపరి చర్యల నిమిత్తం మిల్స్ కాలనీ పోలీసులకు కేసును అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సార్ల రాజు తెలిపారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ అధికారులు, ఆర్ఎస్సై భాను ప్రకాశ్, సిబ్బంది పాల్గొన్నారు.



నగదు, కార్డులు చూపిస్తున్న టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో..

రామన్నపేట: మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ ఇంట్లో పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం దాడి చేసి ఆరుగురు నిందితులను అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. వారి నుంచి రూ.8,340 నగదు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వరంగల్‌కు చెందిన గుండా దిగంబర్, కోట వర్ధన్, కట్కకం ప్రశాంత్, జన్ను కిరణ్, తాళ్ల రాకేష్, బిరెల్లి రాజును అదుపులోకి తీసుకొని మట్టెవాడ పోలీసులకు అప్పగించినట్లు ఏసీపీ వివరించారు. టాస్క్‌ఫోర్స్ దాడుల్లో ఇన్‌స్పెక్టర్ ఎం.రంజిత్‌కుమార్, ఆర్ఎస్సై భానుప్రకాశ్, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదుకు స్పందన

హన్మకొండ: బీజేపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన వస్తోందని ఆ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కల్యాణ్ నాయక్ అన్నారు. కాజీపేట ఫాతిమానగర్ వడ్డెపల్లి చెరువు కట్ట వద్ద ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు తిరుపతి నాయక్ ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పాల్గొని సభ్యత్వ నమోదును ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్టీ మోర్చా నాయకులు రవి నాయక్, గణేష్ నాయక్, నవీన్ నాయక్, రఘు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతో బాలిక మృతి

- ఆస్పత్రి ఎదుట బాధితుల ఆందోళన

హన్మకొండ చౌరస్తా: వైద్యుల నిర్లక్ష్యంతోనే బాలిక మృతి చెందిందని ఆరోపిస్తూ హనుమకొండ పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న డాల్ఫిన్ ఆస్పత్రి ఎదుట మృతురాలి తల్లిదండ్రులు, బంధువులు సోమవారం ఆందోళన చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం ములుగు జిల్లా పత్తిపెల్లి గ్రామానికి చెందిన కవిత, జయపాల్ దంపతుల కుమార్తె వర్షిత (8) డెంగీ లక్షణాలతో బాధపడుతుండగా ములుగులోని వినయ్ ఆస్పత్రిలో రెండు రోజుల పాటు చికిత్స అందించారు. అయినా జ్వరం తగ్గకపోవడంతో అక్కడి వైద్యుల సూచన మేరకు ఈనెల 2వ తేదీన డాల్ఫిన్ ఆస్పత్రిలో చేర్పించారు. ఆదివారం మధ్యాహ్నం తల్లితో మాట్లాడిన చిన్నారిని చూసేందుకు తల్లికి సాయంత్రం అనుమతి ఇవ్వలేదు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.4లక్షలు వసూలు చేశారు. ఒక్కో ఇంజక్షన్ ఖరీదు రూ.53వేల చొప్పున మూడింటిని వేశారు. బాలిక ఆరోగ్య పరిస్థితిని వెల్లడించకుండా మిగిలిన మొత్తాన్ని చెల్లించాలని ఒత్తిడి చేశారని బాధితులు రోదిస్తూ తెలిపారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లనే తమ పాప చనిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రి యాజమాన్యం, వైద్యులపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

వరంగల్ మార్కెట్‌లోకి నిస్సాన్ మాగ్నైట్ ఫేస్‌లిఫ్ట్

హన్మకొండ చౌరస్తా: మార్కెట్‌లోకి కొత్త నిస్సాన్ ఫేస్‌లిఫ్ట్ మోడల్ కారును పెద్దమ్మగడ్డ కెనాల్ సమీపంలోని వీవీసీ నిస్సాన్ షోరూంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీవీసీ సంస్థ చైర్మన్ వీవీ రాజేంద్రప్రసాద్, మేనేజింగ్ డైరెక్టర్ వికాస్ చౌదరి మాట్లాడుతూ నిస్సాన్ మాగ్నైట్ ఫేస్‌లిఫ్ట్ వర్షన్ కారు ఎక్స్ షోరూం ధర రూ.5.99 లక్షలుగా నిర్ణయించినట్లు తెలిపారు. షోరూం జీఎం నరేష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు చేయండి



కాశిబుగ్గ: వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

కాశిబుగ్గ: కాశిబుగ్గ చిన్నవడ్డేపల్లి చెరువు ప్రాంతంలో జరగనున్న రావణ వధ, దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలని కాశిబుగ్గ దసరా ఉత్సవ సమితి సభ్యులు కోరారు. ఈమేరకు కలెక్టర్ డాక్టర్ సత్యాశారదను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు దూపం సంపత్ మాట్లాడుతూ 38 ఏళ్లుగా కాశిబుగ్గలో బతుకమ్మ, రావణ వధ, దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. అధిక సంఖ్యలో ప్రజలు హాజరవుతారని చెప్పారు. కమిటీ కన్వీనర్ బయ్యాస్వామి, ప్రధాన కార్యదర్శి సముద్రాల పరమేశ్వర్, మాజీ కార్పొరేటర్ ఓని భాస్కర్, బాంబుల కుమార్, గోరంటల మనోహర్, ఓంప్రకాష్ కోలారియా, సిద్దోజు శ్రీనివాస్, సిలువేరు థామస్, దాసరి రాజేష్, కూచన రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



ఖిలా వరంగల్: వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

ప్రతిఒక్కరూ సహకరించాలి

ఖిలా వరంగల్: వరంగల్ మహానగరానికి వన్నె తెచ్చిందే సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలని, ఈ క్రమంలో ఉత్సవాలను విజయవంతం చేసేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఉర్సుగుట్ట రంగలీల దసరా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నాగపూరి సంజయ్‌బాబు కోరారు. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యను ఉత్సవ కమిటీ సభ్యులు సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ యంత్రాంగం, ప్రజా ప్రతినిధుల సహాయ సహకారంతో రంగలీల మైదానంలో ఏర్పాట్లు జరుగుతున్నాయని సంజయ్ తెలిపారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు మేడిది మధుసూదన్, మండ వెంకన్న, వలిదె శివమూర్తి, ట్రస్ట్ చైర్మన్ వంగరి కోటేశ్వర్, ఉపాధ్యక్షులు గోనె రాంప్రసాద్, సంజయ్ గౌడ్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

రీకౌంటింగ్‌పై విచారణ జరపాలి

రామన్నపేట: ఇటీవల జరిగిన వరంగల్ పట్టణ గృహనిర్మాణ తాపీ మేస్త్రీల సంఘం ప్రధాన కార్యదర్శి స్థానానికి జరిగిన రీకౌంటింగ్‌పై పూర్తిస్థాయిలో విచారణ చేయాలని ప్రధాన కార్యదర్శి స్థానానికి పోటీ చేసిన దామెర లింగయ్య కోరారు. ఈమేరకు ఎన్నికల నిర్వహణ అధికారులను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. లింగయ్య తెలిపిన వివరాల ప్రకారం సెప్టెంబర్ 27న జరిగిన వరంగల్ పట్టణ గృహ నిర్మాణ తాపీ మేస్త్రీల సంఘం పోటీ చేసిన రెండు ఓట్ల తేడాతో ముల్కలపల్లి ఐలయ్యపై లింగయ్య గెలుపొందినట్లు ఎన్నికల అధికారులు ధ్రువీకరించారు. అనంతరం 29న రీకౌంటింగ్ జరపాలని ఎన్నికల అధికారులను ముల్కలపల్లి ఐలయ్య కోరారు. అప్పటికే సంఘం కార్యాలయంలో ఉన్న బ్యాలెట్ బాక్స్‌లు తెరిచి ఉండటంతో రీకౌంటింగ్‌లో అనూహ్యంగా లింగయ్య, ఐలయ్య కాకుండా ఇంకో అభ్యర్థి అందుగుల మధుకు మూడు ఓట్ల ఆధిక్యం వచ్చింది. ఈక్రమంలో ఫలితాలపై సమగ్ర విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని లింగయ్య కోరినట్లు పేర్కొన్నారు.

జీడీఎస్‌ల సమస్యలు పరిష్కరించాలి

హన్మకొండ: గ్రామీణ తపాలా ఉద్యోగులకు కనీస వేతనాన్ని అమలు చేసి, సౌకర్యాలు కల్పిస్తూ కమలేష్‌చంద్ర కమిటీ అనుకూల సిఫార్సులు అమలు చేయాలని అఖిల భారత గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు బొద్దున వెంకటేశ్వర్లు కోరారు. ఈమేరకు విజయవాడలో గ్రామీణ తపాల ఉద్యోగుల సంఘం నాయకులతో కలిసి కేంద్ర కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను కలిసి వినతిపత్రం అందించారు.

నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలి

వరంగల్: రాష్ట్రంలో నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో అధికారంలోకి అధికారంలోకి వచ్చిన ఈపదేళ్ల కాలంలో నిరుద్యోగులకు బీఆర్ఎస్ ప్రభుత్వం మొండిచేయి చూపిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఏఐఎఫ్‌డీవై రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంద రవి అన్నారు. వరంగల్ కలెక్టరేట్ కార్యాలయంలో ఏఓ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. జక్కా అశోక్, ఎర్ర రాజు, రంజిత్, రాజు పాల్గొన్నారు.

వర్గీకరణ అనంతరం పోస్టులు భర్తీ చేయాలి

కాజీపేట: ఎస్సీ వర్గీకరణ చేయకుండానే ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవాలని మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్ మాదిగ సూచించారు. కాజీపేట మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 9న హనుమకొండ అంబేడ్కర్ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించనున్న నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. అంకన్నకుంట వెంకటస్వామి, జేరిపోతుల సారంగపాణి, రేణుకుంట్ల ఉమామహేష్, మంద స్వరాజ్ మాదిగ పాల్గొన్నారు.

మాలధారులకు దుస్తుల పంపిణీ

ఖిలా వరంగల్: శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వరంగల్ శివనగర్‌లోని బొర్రయ్య వీధిలో కాంగ్రెస్ నేత కరాటే ప్రభాకర్ ఆధ్వర్యంలో అమ్మవారి మహిళా మాలధారులకు గాజులు, పండ్లు, దుస్తులను సోమవారం పంపిణీ చేశారు. ముఖ్యఅతిథులుగా కాంగ్రెస్ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు, నగర మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, కొయ్యడ ఉమ, శంకర్, యాకుబీ, రవి తదితరులు పాల్గొన్నారు.

ముళ్ల పొదల తొలగింపు

హసన్‌పర్తి: అన్నాసాగరం – మడిపల్లి మార్గమధ్యలో రోడ్డుకు ఇరువైపులా కమ్ముకుపోయిన ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలను తొలగించారు. పొదల కారణంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ప్రయాణికులు ఫిర్యాదు చేశారు. దీంతో మాజీ సర్పంచ్ చిర్ర సుమలత ఆధ్వర్యంలో ముళ్ల పొదలను సోమవారం తొలగించారు. కార్యక్రమంలో నాయకుడు చిర్ర విజయ్‌కుమార్, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎంహెచ్ఓ రాజారెడ్డికి సన్మానం

మామునూరు: వరంగల్ బల్దియా కార్యాలయంలో ముఖ్య ఆరోగ్య అధికారిగా డాక్టర్ రాజారెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు రాజారెడ్డిని తిమ్మాపురం, అల్లీపురం ప్రజలు సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో కుమార్, కోటి, సతీష్, ఉప్లానా, మహేష్, అనిల్, తదితరులు ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు..

కాజీపేట: జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఆకుల సరితశ్రీధర్ రావు, చిందం రవీందర్, ఓమా ప్రకాష్, ఎర్రబాటి కిరణ్మయిని హనుమకొండ హౌజింగ్ బోర్డు కార్యాలయంలో ఓరుగల్లు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు సోమవారం సన్మానించారు. సంఘం అధ్యక్షుడు పేరుకారి శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో 10మంది ఉత్తమ ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో గౌరవ సలహాదారుడు నిమ్మల శ్రీనివాస్, కనుకుంట్ల రవికుమార్, మాధవపెద్ది రమేష్ రెడ్డి, చిందం రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడికి..

మామునూరు: ఆర్యవైశ్య మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన వరంగల్ 43వ డివిజన్ సత్యసాయినగర్ వేంకటేశ్వరకాలనీకి చెందిన నాగబండి శ్రీనివాస్ గుప్తాను 21 కాలనీల అధ్యక్షుడు కర్నె రవీందర్, తదితరులు సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో పలు కాలనీల అధ్యక్షులు సుభాష్‌రావు, గూగుల్ విజయ్, ప్రసాద్ కుమార్, రమణా చార్యులు, తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌కు..

కాజీపేట: తెలంగాణ రెడ్డి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన అర్జుల కిషన్‌రెడ్డిని జిల్లా సంఘం నాయకులు సోమవారం సన్మానించారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్ల సంజీవరెడ్డి, చందుపట్ల నర్సింహరెడ్డి, రావుల నర్సింహ రెడ్డి, కె.దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాడియా గాంగ్ నాయక్‌కు అవార్డు

కాళోజీ సెంటర్: తిరుమల తిరుపతి వేంకటేశ్వర స్వామి సన్నిధిలో నేషనల్ కమిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఎనిమిదో సౌత్ ఇండియా బహుజన సాహిత్య అకాడమీ అవార్డును తెలంగాణ రాష్ట్రం నుంచి గిరిజన ఉపాధ్యాయుడు పాడియా గాంగ్ నాయక్ అందుకున్నారు.

తల్లి పింఛన్ కోసం అన్నపై తమ్ముడి దాడి

మడికొండ: అన్నపై తమ్ముడు దాడి చేసిన సంఘటన కాజీపేట మండలం అయోధ్యపురం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కాజీపేట మండలం అయోధ్యపురం గ్రామానికి చెందిన రాజగారి రాజేందర్, రాజగారి వెంకటేష్ అన్నదమ్ములు. వారి తల్లి రాజగారి వీరమ్మ రైల్వే పింఛన్ కోసం ఇరువురు గొడవపడి అన్న రాజేందర్‌పై తమ్ముడు కత్తితో దాడి చేశాడు. ఈ సంఘటనలో రాజేందర్‌కు తీవ్ర గాయాలు కాగా, చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. బాధితుడు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ కిషన్ తెలిపారు.

వాహనదారుడిపై కేసు నమోదు

ఖిలా వరంగల్: రోడ్డు ప్రమాదానికి కారణమైన వాహనదారుడు, సయ్యద్‌పాషాపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు.